సాక్షి అనంతపురం

శుక్రవారం । 26 । జనవరి । 2024

I



బియ్యం కార్డులతో అభయం

జిల్లాలో అర్హులైన 5,736 మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసింది. IIలో



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.



జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్రీడాకారులకు సత్కారం



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఎస్పీ అన్బురాజన్ సత్కరించారు. గోవాలో ఈ నెల 9 నుంచి 13 వరకూ 22వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి నలుగురు పాల్గొన్నారు. ఒక బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. ఎఫ్–56 షాట్‌పుట్ పోటీల్లో సాకే బాబు బంగారు పతకం, నీలం పల్లవి, నీలం సంజీవ రెడ్డి చెరో సిల్వర్ పతకం దక్కించుకున్నారు. వారిని గురువారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ డీపీఓలోని తన చాంబర్‌లో సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసులు, శాప్ కోచ్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాలల బీమా చెక్కుల పంపిణీ



విద్యార్థి తల్లికి చెక్కు అందజేస్తున్న ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు బాలల బీమా చెక్కులు పంపిణీ చేశారు. యల్లనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి జి.కిరణ్, అనంతపురం రూరల్ మండలం పాములాయి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న యు.చరణ్య, శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి సి.శ్రీధర్ వివిధ సందర్భాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందారు. బాలల బీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను విద్యార్థుల తల్లులకు గురువారం సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: 'ఉన్నతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులపై బెంగళూరులో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10, ఇంటర్, డిప్లొమాలో పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 28 సంవత్సరాల్లోపు నిరుద్యోగ యువతకు భోజనం, వసతితో శిక్షణ ఇస్తామన్నారు. ట్యాలీ+జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలపై 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ బీఎల్‌ఓగా పవన్‌కుమార్

- గవర్నర్ చేతుల మీదుగా సత్కారం



గవర్నర్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బోయ పవన్‌కుమార్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 15వ సచివాలయంలో వార్డు అమెనిటీస్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న బోయ పవన్‌కుమార్ ఉత్తమ బీఎల్‌ఓ అవార్డు అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్ పవన్‌కు అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ చేతుల మీదుగా పవన్‌కుమార్ అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు.

నలుగురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కదిరి అర్బన్‌లో పనిచేస్తున్న డీవీ నారాయణరెడ్డిని అనంతపురం ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. అనంతపురం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న సి. వెంకటేష్‌నాయక్‌ను అనంతపురం సీసీఎస్ బ్రాంచ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం



త్రివర్ణ శోభితమైన కలెక్టరేట్



విద్యుద్దీపాలంకరణలో టవర్‌క్లాక్

గణతంత్ర వేడుకకు వేళాయె

గణతంత్ర దినోత్సవానికి పోలీసు పరేడ్ మైదానం ముస్తాబయ్యింది. శుక్రవారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఎం.గౌతమి ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.30కు జిల్లా ప్రగతి నివేదిక వినిపిస్తారు. 9.55 గంటలకు ప్రగతి రథాల ప్రదర్శన, 10.30కు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.45కు విశిష్ట సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాల ప్రదానం, 11.20కు స్టాళ్ల సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. – అనంతపురం అర్బన్:

శిశువులకు సర్వజనరక్ష



- చిత్రంలో కనిపిస్తున్న పసికందు వయసు 20 రోజులు. పుట్టిన తర్వాత ఏడవకపోవడం, ఆయాసం ఎక్కువగా ఉండడం, ఫిట్స్ తదితర సమస్యలతో బాధపడుతున్న పాపను ఈ నెల 16న తాడిపత్రి నుంచి తల్లిదండ్రులు సర్వజనాస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్లు 3 రోజుల పాటు సీ ప్యాప్ మిషన్, వార్మర్‌పై సేవలందించారు. పసికందు ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వెంటిలేటర్, సీ ప్యాప్‌పై ఉంచారు. కోలుకోవడంతో తల్లిపాలు పట్టిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేయనున్నారు. ప్రైవేటుగా ఈ వైద్యం పొందాలంటే రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిసింది.



- నవజాత శిశు కేంద్రంలో సీ ప్యాప్ మిషన్, వార్మర్‌పై చికిత్స పొందుతున్న ఈ పసికందు 5 రోజుల క్రితం బత్తలపల్లి ఆస్పత్రిలో జన్మించింది. ఆయాసం, ఇన్‌ఫెక్షన్ల ఉండడతో అక్కడి వైద్యులు జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. దీంతో తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకురాగా, ప్రస్తుతం కోలుకుంటోంది.

- నవజాత శిశువులకు జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్యం
- అత్యాధునిక సదుపాయాలు సమకూర్చిన ప్రభుత్వం
- రూ. లక్షలు విలువ చేసే సేవలు ఉచితంగా అందిస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాలింతలు



సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న నవజాత శిశువులు

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగాన్ని ప్రభుత్వం బలోపేతం చేసింది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నవజాత శిశు కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 28 రోజుల పసికందులకు నాణ్యమైన వైద్యం అందేలా వసతులు సమకూర్చింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.లక్షలు ఖర్చు చేసి పొందే సేవలను ఉచితంగా అందిస్తోంది. పేద, సామాన్య మధ్య తరగతి వర్గాలకు సాంత్వన చేకూరుస్తోంది.

గతంలో అధ్వానం..

2012–13లో సర్వజనాస్పత్రిలో 20 పడకల నవజాత శిశు కేంద్రం ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఈ కేంద్రం అధ్వాన స్థితికి చేరుకుంది. దీనికితోడు డాక్టర్లు లేరంటూ అక్కడి నియోనెటాల్ యూనిట్ తొలగించారు. దీంతో అప్పుడే పుట్టిన బిడ్డలను తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి, సొంతంగా డబ్బు ఖర్చు చేసుకుంటూ వైద్య సేవలు పొందేవారు.

సీఎం జగన్ హయాంలో మహర్దశ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సర్వజనాస్పత్రికి మహర్దశ పట్టింది. విద్య,వైద్య రంగాలకు పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్ ఆస్పత్రి అభివృద్ధికి రూ. కోట్ల నిధులు విడుదల చేశారు. కేంద్రం ప్రభుత్వం నుంచి గ్రాంట్లను మంజూరు చేయించారు. ఈ క్రమంలోనే సర్వజనాస్పత్రిలో 20 పడకల సామర్థ్యంతో రూ.44 లక్షలు ఖర్చు చేసి మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటు చేశారు. అత్యాధునిక పరికరాలైన 40 వార్మర్లు, 14 ఫొటో థెరపీ, 14 మానిటర్స్, 14వెంటిలేటర్లు, 8 సీ ప్యాప్ మిషన్లు సమకూర్చారు. పసికందులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఒక నోడల్ అధికారిని నియమించారు. ఏడుగురు వైద్యులు, 16 మంది స్టాఫ్ నర్సులు, ముగ్గురు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. 24 గంటలూ అత్యాధునిక సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు అడ్మిషన్‌లో ఉన్న నవజాత శిశువుల తల్లుల కోసం ప్రత్యేక వార్డు అందుబాటులోకి తెచ్చారు. పిల్లలకు పాలిచ్చేందుకు యూనిట్‌లో ప్రత్యేక గది, కుర్చీలు ఏర్పాటు చేశారు.

నవజాత శిశు కేంద్రంలో సేవలు ఇలా..

బరువు తక్కువ, నెలలు నిండని, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లలను నవజాత శిశు కేంద్రంలో అడ్మిట్ చేస్తారు. కామెర్లు, బరువు తక్కువ, ఇన్‌ఫెక్షన్ తదితర సమస్యలున్న వారిని లెవెల్ 2గా, తీవ్రమైన ఆయాసం, అతి తక్కువ బరువు, ఫిట్స్ రావడం, వెంటిలేటర్, సీ ప్యాప్, తదితరాలు అవసరముండే పసికందులను లెవెల్ 3 (ప్రాణాంతక) కేసులుగా పరిగణించి వైద్యులు, స్టాఫ్‌నర్సులు సేవలందిస్తున్నారు.

గత నాలుగేళ్లలో వైద్యం పొందిన నవజాత శిశువుల సంఖ్య ఇలా..

2020-21	1,510
2021-22	1,896
2022-23	2,831
2023	2,630

3 రోజులు అన్నీ చూసుకున్నారు

ఈ నెల 16న కదిరి ఆస్పత్రిలో ప్రసవం జరిగింది. పాప ఉమ్మనీరు తాగిందని, ఆయాసపడుతోందని వైద్యులు చెప్పారు. సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో ఇక్కడికి తీసుకొచ్చాం. 3 రోజుల పాటు వైద్యులు, స్టాఫ్ నర్సులే అన్నీ చూసుకున్నారు. పెద్ద పెద్ద ప్రైవేట్ ఆస్పత్రుల తరహాలో సేవలు అందించారు. బిడ్డకు మెరుగైన వైద్యం అందించడంతో కోలుకుంది. సురక్షితంగా ఇంటికి తీసుకెళ్తున్నా. చాలా సంతోషంగా ఉంది. పేదలు ఇబ్బంది పడకుండా చూస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– శిరీష, పెడబల్లి, కదిరి

కంటికి రెప్పలా కాపాడుతున్నాం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రైవేటుగా పొందాలంటే చాలా ఖర్చు చేయాలి. బిడ్డ ఆరోగ్య పరిస్థితిని బట్టి రోజుకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. సర్వజనాస్పత్రిలో అటువంటి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ప్రాణాంతక స్థితిలో ఉండే నవజాత శిశువులను కంటికి రెప్పలా చూసుకుంటున్నాం. బిడ్డ ఆరోగ్యం మెరుగుపరిచి తల్లిదండ్రులకు అందిస్తున్నాం.

– డాక్టర్ శ్రీధర్, చిన్నపిల్లల వైద్యుడు, జీజీహెచ్

త్వరలో మరో యూనిట్ ప్రారంభం

పుట్టుకతో కామెర్లు, బరువు తక్కువ, ఇతర సమస్యలున్న పసికందులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం. ఉమ్మడి జిల్లా నుంచి రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వం ఫేజ్–2 కింద మరో యూనిట్ ఏర్పాటు చేసింది. త్వరలో ఆ యూనిట్‌ను ప్రారంభిస్తాం. నాణ్యమైన వైద్యం అందుతుండడంతో పసికందుల మరణాల సంఖ్య తగ్గింది.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పీహెచ్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రశాంతంగా జరిగింది. పాత డీఈఓ కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సమక్షంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓల–2 బృందం సభ్యులు సర్టిఫికెట్లను పరిశీలించారు. మొత్తం 264 మంది విద్యార్థులకు గాను 255 మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, గోవిందునాయక్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

బెళుగుప్ప: పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మండలంలోని కాలువపల్లి, కోనంపల్లి, దుద్దేకుంట, అంకంపల్లి, రామసాగరం, జీడిపల్లి, బెళుగుప్ప, బెళుగుప్ప తండా, ఎర్రగుడి, అవులెన్న, వెంకటాద్రిపల్లి, శీర్పి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో వెలుతురు, విద్యుత్, ఫర్నిచర్, నీటి సదుపాయం , మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు ఓటర్లకు తగిన దూరంలోనే కేంద్రం ఉందా అనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, మండల పరిషత్ ఏఓ దామోదర్, వ్యవసాయశాఖ అధికారి పృథ్వీసాగర్,ఈఓఆర్‌డీ మాధవరెడ్డి, ఏఈ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

520 మందికి సేవా అవార్డులు

అనంతపురం అర్బన్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన 520 మంది అధికారులు, ఉద్యోగులను సేవా అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఎం.గౌతమి చేతుల మీదుగా వీరు ప్రశంసా పత్రాలను అందుకుంటారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, కుటుంబ తగాదాలు, మోటారు వాహనాల ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ పన్నుల కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓటే శాసనం.. కచ్చితంగా వినియోగిద్దాం





ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ గౌతమి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ గాయత్రీదేవి. సీనియర్ ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి పిలుపు
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

అనంతపురం అర్బన్: "ప్రజాస్వామ్యంలో ఓటే శాసనం. మనం నిర్ణయించిన వారే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతారు. మంచి వ్యక్తులను ఎన్నుకున్నప్పుడే ప్రజాప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి" అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. "భారత దేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతాం . మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తాం" అంటూ కలెక్టర్‌తో పాటు నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్‌డీఓలు,డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన గొప్ప ఆయుధం ఓటుహక్కు అన్నారు. ప్రతి పౌరుడు నిజాయతీగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను కలెక్టర్ సన్మానించారు. కొత్త ఓటరుగా నమోదైన యువతకు ఎపిక్ (ఓటరు ఐడీ) కార్డులను అందించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, రాణిసుస్మిత, డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అవార్డులు

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో మంచి పనితీరు కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ గౌతమి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న వారిలో ఎన్నికల సెల్ తహసీల్దారు ఎస్.బి. భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్లు (ఎన్నికలు) వి.ఎస్.సుజాతదేవి,నాగేంద్రప్రసాద్, రామకృష్ణ, వెంకటప్పలు, సీనియర్ అసిస్టెంట్లు శామ్యూల్ బెంజిమన్, యోగేంద్రప్రసాద్, శ్రీనివాసులు, టెక్నికల్ సపోర్టర్ (ఐటీ) జి.శివశంకర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ బి.శ్రీనాథ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు రెహమాన్, కదిరప్ప, ప్రశాంత్‌కుమార్, రామనాథ్, ఆఫీస్ సబార్డినేట్ మహేష్ ఉన్నారు.

విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలి

ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించి ప్రసార మాధ్యమాల్లో వ్యతిరేక కథనాలు వచ్చినప్పుడు విచారణ చేపట్టాలన్నారు. సంబంధిత ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. కథనంలో వాస్తవం ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. వాస్తవం లేదని నిరూపణ అయితే ప్రసార మాధ్యమాలకు రీజాయిండర్ ఇవ్వాలని సూచించారు. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి వచ్చిన క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

'పరీక్ష పే చర్చ'ను వీక్షించండి

అనంతపురం ఎడ్యుకేషన్: దేశ రాజధాని ఢిల్లీలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. కార్యక్రమాన్ని వివిధ మాధ్యమాల ద్వారా అందరూ వీక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు అడిగే వివిధ ప్రశ్నలకు ప్రధానమంత్రి నేరుగా సమాధానాలిస్తారని పేర్కొన్నారు. దూరదర్శన్ చానల్స్, ప్రధాన ప్రైవేట్ చానల్స్, రేడియో, యూట్యూబ్ లింకుల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని వెల్లడించారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలలు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. IFP/smart tv/radio/mobile/Computer/laptop, Live will be in DD National, www.mygov.in YouTube channel ద్వారా విద్యార్థులు వీక్షించేలా చూడాలని కోరారు. డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, డీసీఈబీ కార్యదర్శి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా

ఓటరు ప్రతిజ్ఞ చేయించిన ఎస్పీ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: స్థానిక పోలీసు కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అన్బురాజన్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, పలువురు సీఐలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

28న ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 28న అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోతుల మనోజ్, సత్యారంగయ్య, సత్రశాల మంజునాథ్, రమేష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: అనంతపురం-ధర్మవరం మార్గంలో గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్, పింక్, వైట్ కలర్ నిలువు గీతలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం తెలిసిన వారు 94406 27640, 94405 52808లో సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు కోరారు.

బియ్యం కార్డులతో అభయం

- 'ద్వైవార్షిక' సంతోషం..
- పేదలకు కొత్తగా 5,736 కార్డులు మంజూరు
- ఈ నెల నుంచే సరుకుల పంపిణీతో హర్షం


కార్డుదారులకు బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం


కొత్తగా మంజూరైన బియ్యం కార్డును లబ్ధిదారులకు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం అర్బన్: జగన్ సర్కార్‌లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే పేదరికమే ప్రామాణికం. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను నేరుగా ఇంటికే చేరుస్తోంది. ఈ క్రమంలో అర్హులైన పేదలకు ద్వైవార్షిక మంజూరు కింద జిల్లాలో 5,736 మందికి కొత్తగా బియ్యం కార్డులను ప్రభుత్వం ఈ నెలలో ఇచ్చింది. లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి కార్డులను అందజేశారు. రేషన్‌ను కూడా ఈ నెల నుంచే పంపిణీ చేపట్టింది.

జిల్లాలో కార్డులు 6.69 లక్షలు

జిల్లాలో గత నెల వరకు 6,63,920 బియ్యం కార్డులు ఉండేవి. ఈ నెలలో కొత్తగా 5,736 కార్డులు మంజూరయ్యాయి. దీంతో జిల్లాలో బియ్యం కార్డుల సంఖ్య 6,69,656కు చేరింది. జిల్లాకు మంజూరైన కొత్త కార్డుల్లో అనంతపురం రెవెన్యూ డివిజనే అధికంగా వచ్చాయి. ఇందులో అనంతపురం రెవెన్యూ డివిజన్‌కు 2,566, గుంతకల్లు డివిజన్‌కు 1,615, కళ్యాణదుర్గం డివిజన్‌కు 1,555 కార్డులు కేటాయించారు.

సచివాలయ సిబ్బంది సేవలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన పేదల దరి చేర్చే విషయంలో సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవలను లబ్ధిదారులు ప్రశంసిస్తున్నారు. అర్హులైన వారికి పథకాలను వర్తింపజేసేందుకు అవసరమైన అన్ని చర్యలనూ అంకితభావంతో నిర్వర్తిస్తున్నారు. పథకం మంజూరైన వెంటనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాటి ఫలాలను అందజేస్తున్నారు.

సచివాలయ సేవలు అమోఘం



నేను ఒంటరి మహిళను. నాకు ఆధార్ కార్డు కూడా లేదు. సచివాలయ సిబ్బంది నా వద్దకు వచ్చి ఆధార్ కార్డు చేయించారు. ఆ తర్వాత బియ్యం కార్డు మంజూరు చేయించి ఆదుకున్నారు. కార్డు ఇచ్చిన ప్రభుత్వానికి, ఇప్పించిన సచివాలయ సిబ్బందికి రుణపడి ఉంటాను.

– ఉమాదేవి, సోమనాథ్‌నగర్, అనంతపురం

చాలా సంతోషంగా ఉంది



మాది చాలా పేద కుటుంబం. నాకు బియ్యం కార్డు లేదు. సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి నా వివరాలు తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆధార్ కార్డు వచ్చేలా చేశారు. ఆ తరువాత బియ్యం కార్డుకు దరఖాస్తు చేయించి ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. చాలా సంతోషంగా ఉంది.

– సుగుణ, యువజన కాలనీ, అనంతపురం

సేవ చేసే అవకాశం కలిగింది



పేదలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశాన్ని ప్రభుత్వం మాకు కల్పించింది. సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందేలా చేస్తున్నప్పుడు వారి కళ్లలో కనిపించే ఆనందం చూస్తే మాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. పేదలకు చేస్తున్న సేవ ద్వారా మేము చాలా సంతృప్తి పొందుతున్నాము.

– లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగి

పేదరికం ప్రామాణికంగా పథకాలు



పేదరికం ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు వర్తించేలా చూస్తున్నాం. ద్వైవార్షిక మంజూరు కింద అనంతపురం జిల్లాలో 5,736 మందికి కొత్తగా బియ్యం కార్డులు వచ్చాయి. పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు కొత్త కార్డులకు ఈ నెలలోనే బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

జాతీయ స్థాయిలో రాణించాలి

- క్రీడాకారులకు జెడ్పీ సీఈఓ నిదియాదేవి పిలుపు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఈఓ వైఖోమ్ నిదియాదేవి

ఉరవకొండ: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి రాష్ట్ర పేరు ప్రఖ్యాతలను ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఉరవకొండలోని ఎస్‌కే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ అమృత్‌రాజ్, పీడీ మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఉరవకొండ, విడపనకల్లు, కూడేరు, బెళుగుప్ప, వజ్రకరూరు మండలాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నీ

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. రెండో రోజు ముఖ్యఅతిథులుగా గురువారం ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రతాపరెడ్డి, ధర్మవరం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. తొలి సెమీఫైనల్ బాలుర విభాగంలో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ జట్టు, అనంతపురం ఎరా స్కూల్ జట్టు తలపడగా 37–35 పాయింట్లతో ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్ బాలుర, బాలికల విభాగం మ్యాచ్‌లు శుక్రవారం ఉదయం జరుగుతాయి.

త్రివర్ణ పతాక ప్రదర్శనకు ఆహ్వానం

రొద్దం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్ణాటకలోని చింతామణిలో అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించే అవకాశం రొద్దం గ్రామానికి చెందిన కర్తడొంతి లక్ష్మీనారాయణ గుప్తాకు దక్కింది. ఈ మేరకు ఆ రాష్ట్ర అధికారుల నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో 18 మంది సభ్యులుగా ఉన్న తన బృందంతో ఆయన చింతామణికి బయలుదేరి వెళ్లారు. ఈ ఏడాది 2,200 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు గుప్తా వివరించారు.

అశ్వత్థనారాయణుడిని దర్శించుకున్న విదేశీయులు


స్వామిని దర్శించుకుంటున్న స్పెయిన్ దేశస్తులు

పెద్దపప్పూరు: ప్రఖ్యాతి గాంచిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రాన్ని గురువారం ఉదయం స్పెయిన్ దేశస్తులు సందర్శించారు. దాదాపు 45 మంది ప్రత్యేక వాహనాల్లో తొలుత పెద్దపప్పూరులోని అంబేడ్కర్ కాలనీకి చేరుకున్నారు. ఆర్డీటీ కాలనీలో నూతనంగా నిర్మించిన పక్కాగృహాలను ప్రారంభించారు. అనంతరం అశ్వత్థనారాయణస్వామి క్షేత్రాన్ని సందర్శించారు. తొలిసారిగా క్షేత్రానికి వచ్చిన విదేశీయులను ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం సాదరంగా ఆహ్వానించారు. విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుగులో అర్చకులు సుధీర్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం, సునీల్‌కుమార్ వివరించగా, ఆర్డీటీ తరఫున వచ్చిన ఉద్యోగి స్పానిష్‌లో తర్జుమా చేసి వినిపించారు. ప్రశాంత వాతావరణంలో ఆలయం ఎంతో బాగుందని, స్వామివారిని దర్శించుకోవడం తమకెంతో సంతృప్తినిచ్చిందంటూ ఈ సందర్భంగా విదేశీయులు హర్షం వ్యక్తం చేశారు.

పెళ్లి చేయలేదని విద్యార్థి ఆత్మహత్య


అభిషేక్ (ఫైల్)

కుందుర్పి: ప్రేమించిన బాలికతో పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఓ విద్యార్థి (మైనర్) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన సోమనాథ్, రుక్మిణమ్మ దంపతుల పెద్ద కుమారుడు అభిషేక్ (17) కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన ఓ బాలికతో ప్రేమలో పడ్డాడు. రెండు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలిపి పెళ్లి చేయాలని పట్టుబట్టాడు. ఈ వయసులోనే పెళ్లి వద్దని బాగా చదువుకుని ఉద్యోగం వచ్చిన తర్వాత అదే అమ్మాయితో పెళ్లి చేస్తామని, అప్పటి వరకూ బుద్ధిగా చదువుకోవాలని తండ్రి సోమనాథ్ తెలిపాడు. ఇందుకు అభిషేక్ అంగీకరించలేదు. తనకిప్పుడే పెళ్లి చేయాలని పట్టుబట్టాడు. దీంతో అనహానానికి గురైన తల్లిదండ్రులు.... మైనారిటీ తీరకముందే పెళ్లి చేస్తే జరిగే అనర్థాలను కుమారుడికి వివరించారు. తాము చెప్పినట్లు నడుచుకోవాలన్నారు. దీంతో మనస్తాపం చెందిన అభిషేక్ గురువారం తెల్లవారుజామున తమ తోటలోకి వెళ్లి చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పొలానికి వెళ్లిన తండ్రి సోమనాథ్... చెట్టు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

పేదరిక నిర్మూలనే ఆర్డీటీ లక్ష్యం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్


మాట్లాడుతున్న మాంఛో ఫెర్రర్

కూడేరు: పేదరిక నిర్మూలనే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ తెలిపారు. గత ఏడాది నవంబర్ 17న విశాలఫెర్రర్ పేరుతో కూడేరులో మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్డీటీ సంఘాల్లోని మహిళలంతా రూ.500 చొప్పున చెల్లించి వాటాదారులుగా చేరారు. పొదుపు మొత్తం రూ.25లక్షలకు చేరుకుంది. దీంతో మహిళలకు రుణ సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 195 మంది మహిళలకు రుణాలను చెక్ రూపంలో ఆయన అందజేసి, మాట్లాడారు. నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ఫాదర్ ఫెర్రర్ ఆశయమన్నారు. ఆ ఆశయ సాధనలో భాగంగానే విశాల ఫెర్రర్ మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్ ఆవిర్భవించిందన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తాము సంపాదించిన మొత్తంలో కొంత ఈ బ్యాంకుల్లో పొదుపు చేసుకోవాలని సూచించారు. వడ్డీ రూపంలో సమకూరే ఆదాయాన్ని డిపాజిట్ మొత్తంలోకి కలిపి సభ్యులంతా వాటాగా పొందవచ్చునన్నారు. అవసరాలకు తీసుకున్న రుణాన్ని ఆదాయ వనరులుగా మార్చుకోవాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంక్ సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్, 40 మంది స్పెయిన్ దేశస్తులు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏటీఎల్ నల్లపరెడ్డి, ఎస్టీఎల్ హంస్వేనీ, సీఓలు సిద్ధప్ప, మధు, మహిళా బ్యాంకు బీఓడీలు పాల్గొన్నారు.

తమ్ముని చేతిలో అన్న హతం

తనకల్లు: క్షణికావేశంలో తమ్ముడు కర్రతో దాడి చేయడంతో అన్న మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... తనకల్లు మండలం నడిమికుంటపల్లికి చెందిన సంజీవులు (30), వెంకటేష్ అన్నదమ్ములు. బుధవారం రాత్రి సంజీవులు చేపలు తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఎదురుపడ్డ తమ్ముడి భార్య ప్రసన్నకు చేపలు ఇచ్చి కూర వండిపెట్టాలన్నాడు. అయితే అర్ధరాత్రి కావడంతో ఆ సమయంలో చేయడం సాధ్యం కాదని, మరుసటి రోజు ఉదయం చేసిస్తానని ఆమె తెలిపింది. దీంతో తనకు మసాలాలు సిద్ధం చేసిస్తే తానే వండుకుంటానని సంజీవులు తెలపడంతో ఆమె మసాలా చేసిచ్చి భర్తతో కలసి మిద్దెపైకి ఎక్కి నిద్రపోయారు. చేపల కూర వండుకున్న సంజీవులు అన్నం తింటూ మద్యం మత్తులో తమ్ముడిని, కుటుంబసభ్యులను దుర్భాషలాడడం మొదలుపెట్టాడు. అసహనానికి గురైన వెంకటేష్ కిందకు వచ్చి అన్నను సముదాయించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సంజీవులు మరింత రెచ్చిపోవడంతో క్షణికావేశానికి లోనైన వెంకటేష్ చేతికి అందిన చెక్క తీసుకుని సంజీవులు తలపై బలంగా కొట్టాడు. ఘటనతో తీవ్ర రక్తస్రావమై సంజీవులు అక్కడికక్కడే మృతి చెందాడు. హతుడి మేనత్త నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ లింగన్న తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్‌కుమార్ (ఫైల్)

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప కుమారుడు నవీన్‌కుమార్ (24) ఆత్మహత్య చేసుకున్నాడు. పెనుకొండ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న నవీన్‌కుమార్... బుధవారం రాత్రి ఇంటిపై గదిలో నిద్రించడానికి వెళ్లాడు. గురువారం ఉదయం ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు పైకి వెళ్లి చూశారు. గది తలుపులు తీయకపోవడంతో బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే పైకప్పుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించారు. ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

పరిగి: మండలంలోని పుట్టగూర్లపల్లికి చెందిన కురుబ మంజునాథ్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆయన కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ బుధవారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడిన మంజునాథ్... ఆ తర్వాత మద్యం మత్తులో అదే రోజు రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సీఎస్‌పీలో ఘరానా మోసం

- ఎస్‌బీఐ ఖాతాదారులకు తెలియకుండా రూ. లక్షలు నగదు స్వాహా
- న్యాయం చేయాలంటున్న బాధితులు


మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్పకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు ఉమాపతి

రాయదుర్గం: స్థానిక కణేకల్లు రోడ్డు పక్కనే రామస్వామి వీధికెళ్లే మార్గంలో ఉన్న ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్‌పీ)లో ఘరానా మోసం చోటు చేసుకుంది. ఖాతాదారులకు తెలియకుండానే దాదాపు రూ.లక్షల్లో నగదును నిర్వాహకుడు స్వాహా చేసిన వైనం వెలుగు చూడడంతో పలువురు బాధితులు వెలుగులోకి వచ్చారు. మోసపోయామని తెలిసిన బాధితులు సీఎస్‌పీ చుట్టూ తిరుగుతుండడంతో జాగ్రత్త పడ్డ నిర్వాహకుడు తలుపులు మూసి పదిరోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లాడు. వివరాలు... రాయదుర్గంలోని చౌడమ్మ ఆలయ ప్రాంతానికి చెందిన పి.మీనా, ఉమాపతి (దివ్యాంగుడు) దంపతులు. మీనాకు ఇటీవల డ్వాక్రా రుణం రూ.లక్ష మంజూరైంది. దీంతో ఎస్‌బీఐ సీఎస్‌పీలో నగదు డ్రా చేసుకునేందుకు ఈ నెల 5న వెళ్లింది. ఆ సమయంలో బయోమెట్రిక్‌లో వేలిముద్ర పడలేదంటూ నాలుగు పర్యాయాలు సీఎస్‌పీ నిర్వాహకుడు కాలేస్ ప్రయత్నించాడు. చివరకు సర్వర్‌లో సమస్య ఉందంటూ వెనక్కి పంపాడు. 6వ తేదీ ఉదయం మరోసారి ఆమె వేలిముద్ర తీసుకున్నాడు. ఆధార్ అప్‌డేట్‌లో సమస్య ఉందని రెండు రోజుల తర్వాత వస్తే డబ్బు ఇస్తానని చెప్పి వెనక్కు పంపాడు. కాలేస్ ప్రవర్తనపై అనుమానం రావడంతో ఉమాపతి నేరుగా ఎస్‌బీఐ మేనేజర్‌ను గురువారం కలిసి మాట్లాడాడు. మీనా ఖాతాను బ్యాంక్ అధికారులు పరిశీలించడంతో ఈ నెల 5న రూ.90 వేలు డ్రా యినట్లు వెలుగు చూసింది. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన ఉమాపతి దంపతులు, కుటుంబసభ్యులు నేరుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పను కలసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. విషయం తెలుసుకున్న పలువురు తమ ఖాతాలను పరిశీలించుకున్నారు. అందులో నగదు తక్కువగా ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తూ బ్యాంక్ అధికారులను, పోలీసులను ఆశ్రయించారు. దాదాపు రూ.లక్షల్లో నగదు స్వాహా అయినట్లు సమాచారం.

సీఎస్‌పీతో బ్యాంక్‌కు ఎలాంటి సంబంధం లేదు

ఉమాపతి ఆవేదనను విన్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప వెంటనే ఎస్‌బీఐ మేనేజర్ మృత్యుంజయను తన చాంబర్‌కు పిలిపించుకుని మాట్లాడారు. ఇలాంటి ఫిర్యాదులు ఇటీవల చాలా రావడంతో సర్వీస్ పాయింట్‌ను సీజ్ చేసి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లుగా మేనేజర్ వివరించారు. అయితే సీఎస్‌పీలకు బ్యాంక్‌లతో ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. అయినా ఖాతాదారులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం పలువురు బాధితులు ముందుకు రావడంతో అర్బన్ పోలీసులు విచారణ చేపట్టారు.

వేర్వేరు ప్రమాదాల్లో రెండు జింకల మృతి


మడకశిరలో మృతి చెందిన జింక


నల్లచెరువులో మృతి చెందిన జింక

నల్లచెరువు/ మడకశిర రూరల్: జిల్లా పరిధిలో గురువారం చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో రెండు జింకలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే... మడకశిర మండల పరిధిలో పెనుకొండ ప్రధాన రోడ్డులో గురువారం రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారి కుల్లాయప్ప జింకను అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చారు. పశువైద్య అధికారులతో శవపరీక్ష నిర్వహించి కాల్చివేస్తామని ఆయన తెలిపారు. అలాగే నల్లచెరువు మండల పరిధిలోని ప్యాయలవాండ్లపల్లి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని మరో జింక మృతి చెందింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఖజానా చెక్‌బుక్కుల దహనం



నిరుపయోగంగా ఉన్న చెక్‌బుక్కుల దహనాన్ని పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఖజానా శాఖకు సంబంధించిన నిరుపయోగంగా ఉన్న చెక్‌బుక్‌లను ప్రభుత్వ ఆదేశాల మేరకు దహనం చేసినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఖజానా శాఖ డీడీ సరళ విజయకుమారి నేతృత్వంలో చేపట్టిన చెక్‌బుక్కుల దహనం ప్రక్రియను జేసీ పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పదిమంది జిల్లాస్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఖజానా, అనంతపురం ఉప ఖజానా కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్నటువంటి, పాక్షికంగా వాడిన, వాడని, ఎంఐసీఆర్, సీటీఎస్, ఇతర చెక్‌బుక్కులు మొత్తం 2,192 చెక్కులను దహనం చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా వాటిని దహనం చేశామన్నారు. జిల్లాలోని ఎనిమిది ఉప ఖజానా కార్యాలయాల్లోనూ డీటీఏఓ, రెవెన్యూ, పోలీసు, ఫైర్ అధికారుల సమక్షంలో చెక్‌బుక్కులను దహన ప్రక్రియ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఏటీఓ రాజే, అధికారులు పాల్గొన్నారు.

నగరానికి గోవిందానంద స్వామి రాక



అనంతలో గోవిందానంద స్వామి

అనంతపురం కల్చరల్: కర్ణాటకలోని తలకాడులోని బాలకృష్ణనందా మహా సంస్థానం పీఠాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి హైదరాబాద్ పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో గురువారం నగరానికి విచ్చేశారు. పౌర్ణమి సందర్భంగా కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రమేష్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, సురేష్ బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, ఆలయ అను వంశీకులైన హోసూర్ రామ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఖోఖోలో రాప్తాడు జట్టు విజయం



ఖోఖోలో గెలుపొందిన రాప్తాడు జట్టు సభ్యులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

రాప్తాడు: నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర ఖోఖో పోటీల్లో చెన్నేకొత్తపల్లి జట్టుపై రాప్తాడు బాలుర జట్టు గెలుపొందింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల రాప్తాడులో జరిగిన ఈ పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. చెన్నేకొత్తపల్లి, రాప్తాడు జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగినా చివరకు రాప్తాడు జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, హెచ్‌ఎం నరసింహులు, పీడీలు కేశవమూర్తి, రాజశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

182 మంది ఉద్యోగాలకు ఎంపిక



నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి

అనంతపురం: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 182 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల నుంచి మొత్తం 200 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో రాయల్ ఎన్‌ఫీల్డ్, చెన్నై కంపెనీలో 180 మంది ఎంపిక కాగా, వీరికి ఏడాదికి రూ. 2.40 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నారు. హీరో మోటార్ కంపెనీకి గీతాంజలి, రంజిత్ అనే విద్యార్థులకు ఏడాదికి రూ. 3.65 లక్షల వార్షిక వేతనం దక్కనుంది. కంపెనీ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. జయచంద్రారెడ్డి ఉద్యోగాలు దక్కిన విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే.మల్లికార్జున రావు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేగంగా కులగణన సర్వే

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా కులగణన సర్వే జరుగుతోందని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. దాదాపు 70 శాతం వరకు సర్వే పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.

జగనన్నది మాట తప్పని నైజం



పోలేపల్లిలో ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటతప్పని, మడమ తిప్పని నైజమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుంటిమద్ది, గంతిమర్రి, పోలేపల్లి గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన గొప్ప వ్యక్తి జగనన్న అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పులు మాఫీ చేస్తానని అధికారంలోకొచ్చిన చంద్రబాబు.. పేదలను విస్మరించారన్నారు. కొన్నేళ్లుగా ఈప్రాంతంలో పదవులు అనుభవించిన పరిటాల సునీత కుటుంబ సభ్యులు రామగిరి మండలానికి కేవలం 400 ఇళ్లు మాత్రమే ఇచ్చారన్నారు. ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికీ మండలంలో 4,500 ఇళ్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదన్నారు. గతంలో నాయకుల ఇంటివద్దకు వెళ్లి ప్రజలు తమ సమస్యలను చెప్పుకు నేవారని, ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పథకాలు చేరుతున్నాయన్నారు. కొన్నేళ్లుగా చుక్క నీరులేక కళతప్పిన పేరూరు డ్యాంకు హంద్రీనీవా ద్వారా నీటితో నింపిన చరిత్ర ఉందన్నారు. ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతోపాటు త్వరలో రామగిరి బంగారు గనులను తెరిపించనున్నట్లు తెలిపారు. ముందుగా కుంటిమద్దిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు నరేంద్ర, మీనుగ నాగరాజు, ఓబిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, ఆదిరెడ్డి, జయచంద్రారెడ్డి, సాకే ఆది, రమేష్, జయచంద్రారెడ్డి, రామకృ ష్ణారెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళల జీవితాల్లో వెలుగు



నాగసముద్రం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాగసముద్రం గ్రామంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళా సాధికారతను చేసి చూపించారన్నారు. మహిళా శక్తి అండగా ఉంటే, సీఎం జగన్‌ను ఏ శక్తులూ ఏమీ చేయలేవన్నారు. ఎల్లో మీడియా ఎంత దుష్ప్రచారం చేసినా ఫలితం లేదన్నారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలకు చేసిన మోసాన్ని ప్రతి మహిళా గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజలి జెడ్పీటీసీ గోవింద రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రా రెడ్డి సర్పంచ్ ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల మకానం ప్రారంభించిన ఎమ్మెల్యే 'అనంత'



పీర్ల మకానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సున్నపువీధిలో కార్పొరేటర్ తరిమెల అబూసలేహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీర్ల మకానంను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం పీర్ల మకానంలో ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి , వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్ సీపీ నేత అనంత చంద్రారెడ్డి, తదితరులు ప్రార్థనలు చేశారు.

కొడిమి దర్గా గంధం ఉరుసు ప్రారంభం

రాప్తాడురూరల్: రూరల్ మండలం కొడిమి దర్గా గంధం-ఉరుసును గురువారం ప్రారంభించారు. జనాసనపల్లెకు చెందిన డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షాఖాద్రి ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఫకీర్ల జల్సా విన్యాసాలు, ఖురాన్ పఠనం, దరూద్ షరీఫ్, నాతే షరీఫ్, ఆధ్యాత్మిక, అన్నదానం నిర్వహించారు. జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మ ప్రార్థనలో పాల్గొన్నారు. దర్గా వద్ద రూ. 5 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించిన తాగు నీటి ట్యాంకులు, మరుగుదొడ్లను ప్రారంభించారు. నిర్వాహకులు రెహమాన్ సాహెబ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సూపరింటెండెంట్‌గా ప్రదీప్‌కుమార్



ప్రదీప్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్‌గా ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సునిల్‌కుమార్‌ను మూడు రోజుల కిందట నంద్యాల డీఈఓ కార్యాలయానికి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ పదోన్నతుల జాబితాలో తొలి పేరులో ఉన్న ప్రదీప్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి సమగ్ర శిక్షకు బదిలీ చేశారు. గురువారం ఏపీసీ వరప్రసాద్‌రావును కలిసి అనంతరం బాధ్యతలు తీసుకున్నారు. సెక్టోరియల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది సూపరింటెండెంట్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

28న అనంతకు షర్మిల

అనంతపురం టవర్‌క్లాక్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 28న అనంతపురంలో పర్యటించనున్నట్లు మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఆమె జిల్లాలో పర్యటిస్తోందన్నారు. ఆ రోజు నగరంలో లలిత కళాపరిషత్‌లో కార్యకర్తలతో సమావేశమవుతారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌తో పాటు రాయలసీమ భవిష్యత్‌పై చర్చిస్తారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు దాదాగాంధీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సంబరాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండలంలో ఈ నెల 29 నుంచి జరగబోవు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలను ప్రతి సచివాలయంలో విజయవంతం చేద్దామని మండల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు,నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ మదన్‌మోహన్, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొత్తం 679 సంఘాలకుగాను 6,546 మందికి వైఎస్సార్ ఆసరా కింద రూ.4.48 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఈ నెల 29న సింగంపల్లి, పంపనూరు, తలుపూరు, బి.యాలేరు, సనప తోపుదుర్తి సచివాలయాల్లో ఆసరా కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న ముట్టాల సచివాలయం, 4న ఆత్మకూరు సచివాలయంలో ఈ కార్యక్రమం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్,పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, ఆత్మకూరు ఉప సర్పంచ్ భైరుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, పోతన్న, ఎర్రిస్వామి, మహేష్, లోకేష్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం క్రైం: నగరంలోని బళ్లారి బైపాస్ కూడలిలోని అమృత్ బార్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. నాల్గో పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వాడన్న వివరాలు తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు సీఐ ప్రతాప్‌రెడ్డి సెల్: 9346010581, ఎస్‌ఐ నాగమధు సెల్: 9346917088 నంబర్లలో తెలియజేయాలని తెలిపారు. మృతుడు టీ షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు.

రెండు నెలల్లో తుంగభద్ర జలాలు



ఆత్మకూరు వద్ద పనులను పరిశీలిస్తున్న, దృశ్యం

ఆత్మకూరు: మరో రెండు నెలల్లో ఆత్మకూరుకు తుంగభద్ర జలాలు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ప్రజా ప్రతినిధులు,వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. గురువారం ఆత్మకూరు వద్ద జరుగుతున్న పీఏబీఆర్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు మండలానికి పైప్‌లైన్ ద్వారా తుంగభద్ర జలాలు రాబోతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పనులు పరిశీలించినట్లు తెలిపారు. రూ.95 కోట్లతో జరుగుతున్న పైప్‌లైన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు 70 శాతం వరకు పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పరిష్కరిస్తున్నారన్నారు. మండలంలోని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు,సంపుల నిర్మాణాలు ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, గోపాల్, రామాంజి, పంపనూరు మాజీ సర్పంచ్ వన్నూరప్ప ఎర్రిస్వామి , వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్కేయూ వీసీ కే హుస్సేన్ రెడ్డి

అనంతపురం: ఓటు హక్కును యువత వినియోగించుకోవాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే హుస్సేన్ రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, డాక్టర్ వరలక్ష్మి దేవి పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ఆత్మకూరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ షర్మిల తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. మండల వ్యాప్తంగా 39 వేల ఓట్లకు పైగా ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి,ఎంపీపీ హేమలత, డీటీ ప్రసాద్, ఆర్ఐ నాగభూషణం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైస్ ఎంపీపీ విజయ కుమార్ నాయక్, పాల్గొన్నారు.

అనంతపురం: ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధం లాగా పనిచేస్తుందని జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐ డైరెక్టర్, పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటీపీఆర్ఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీఎస్ శంకర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేఈ శైలజ పాల్గొన్నారు.

వైష్ణవికి డాక్టరేట్ ప్రదానం



కె.వైష్ణవి

అనంతపురం: నగరానికి చెందిన కె. వైష్ణవి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పొందారు. కెమిస్ట్రీ విభాగానికి ప్రొఫెసర్ విశాల్ పర్యవేక్షణలో ఫొటో కాటలటిక్ డిగ్రేషన్ ఫిజికల్ కెమిస్ట్రీ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

సమాజ సేవలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

రాప్తాడురూరల్: సమాజ సేవలో యువతది కీలకపాత్ర అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే స్పెషల్ క్యాంప్ ప్రారంభమైంది. నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడి, వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌళి, కురుగుంట ఎస్సీ వెల్ఫేర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు ప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గిరిప్రసాద్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు రమేష్, ప్రగతి పదం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జయ మారుతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతాలు

అనంతపురం కల్చరల్: నగరంలో పలు ఆలయాల్లో పుష్య సిద్ధ పౌర్ణమి రాశితో గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయం, మూడో రోడ్డులోని షిర్డీ సాయిబాబా మందిరం, మారుతీనగర్‌లోని కోదండ రామాలయం తదితర చోట్ల సత్యనారాయణ స్వామి వ్రతాలను అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఘనంగా నిర్వహించారు. వ్రత కథలు అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం సామూహిక భజనలు, అలంకార సేవల్లో భక్తులు పాల్గొన్నారు.

రేపు టెంకాయల వేలం

అనంతపురం కల్చరల్: నగరంలో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో ఈనెల 27న టెంకాయలు, పూజాసామగ్రి విక్రయించే హక్కు (ఏడాదిపాటు) పొందేందుకు వేలం ఉంటుందని ఈఓ రమేష్‌బాబు, పాలక వర్గ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

వ్యాపారి నిజాయితీ



బాధితుడికి నగల బ్యాగు అందిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్రైం: పండ్ల వ్యాపారి మహమ్మద్ వలీని నగర డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి అభినందించారు. వివరాలు.. స్థానిక హౌసింగ్ బోర్డుకు చెందిన రామచంద్రుడు స్థానిక స్టేట్‌బ్యాంకుకు వెళ్లి తన ఖాతాలో గురువారం కొంత నగదు జమ చేశాడు. అనంతరం రుద్రంపేట డీ మార్ట్ సమీపంలోని వెంచర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. మూడు తులాల బంగారు నగలున్న బ్యాగును ద్విచక్ర వాహనానికి తగిలించుకొని వెళ్తుండగా, మార్గంమధ్యలో కిందపడిపోయింది. ఈవిషయాన్ని గమనించకుండా బాధితుడు ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆజాద్‌నగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి మహమ్మద్ వలీకి ఆ బ్యాగు దొరికింది. సమీపంలోని వారిని ఆరాతీశాడు. అందులో పరిశీలించగా బంగారు చైన్, కమ్మలు (మూడు తులాలు) ఉన్నట్లు గుర్తించాడు. ఆ బ్యాగులో ఉన్న బ్యాంకు పాసుబుక్ ఆధారంగా రామచంద్రుడికి సంబంధించినదని కనుగొని, నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ నాగమధును సంప్రదించి, బాధితుడిని రప్పించారు. బాధితుడికి బ్యాగును డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి అందించారు. మహమ్మద్ వలీ నిజాయితీకి మెచ్చి బాధితుడు రామచంద్రుడు ఔదార్యంగా రూ. 5 వేలు ఇచ్చాడు.

శాంతి సద్భావన యాత్ర విజయవంతం చేయండి

- సేవాగడ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మెంబర్ అశ్వర్థనాయక్

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలో మాతా జగదాంబ, సేవాలాల్ మహరాజ్ శాంతి సద్భావన రథయాత్రను బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలా మహరాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టీటీడీ బోర్డు సభ్యులు, సేవాగడ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అశ్వర్థనాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జన్మస్థలం సేవాఘడ్‌లో ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో మహరాజ్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బంజారాలు సేవాలాల్ మహరాజ్‌ను ఆరాధ్య దైవంగా కొలుస్తున్నట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ప్రార్థిస్తూ మాతా జగదాంబ అమ్మవారు, సేవాలాల్ మహరాజ్‌కు భోగ్ బండార్ నిర్వహించి రథయాత్ర ప్రారంభిస్తామన్నారు. బంజారా భవన్ నుంచి రథయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, విద్యుత్ నగర్ సర్కిల్ మీదుగా ఆదర్శనగర్‌లోని మారెమ్మ ఆలయం వద్ద నుంచి, నాయక్‌నగర్‌లోని మరియామా యాడి ఆలయం వద్ద రథయాత్ర ముగుస్తుందన్నారు. బంజారాలు పెద్ద ఎత్తున హాజరై జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహరాజ్ శాంతి సద్భావన రథయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీనాయక్, బాబు నాయక్, సేవా ఘడ్ కోశాధికారి బాలా నాయక్, ఉపాధ్యక్షుడు బీఆర్ రంగ్లా నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, రామాంజనేయులు నాయక్, ప్రసాద్ నాయక్, నరేష్ నాయక్, మహిళా విభాగం నాయకులు సుగుణ బాయి, శివమణి బాయి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
శుక్రవారం ■ 26-1-2024

ఫ్యాషన్

మూడు రంగుల ముస్తాబు











దేశీయ స్ఫూర్తి కోసం ఈ రోజు ప్రత్యేకంగా కనిపించాలనుకునేవారు తిరంగా రంగులను ట్రై చేయచ్చు. అయితే, ఆరెంజ్, తెలుపు, పచ్చ మూడు రంగులును ఒకే డ్రెస్‌లో ఉండాలనుకునేవారు కొందరైతే, ఒకే కలర్ కాన్సెప్ట్‌తో స్పెషల్‌గా వెలిగిపోవాలనుకునేవారు మరికొందరు ఉంటారు. అలాగని, గాఢీగా కాకుండా లేత రంగుల ప్రత్యేకతతోనూ మెరిసిపోవాలనుకుంటారు. అభిరుచికి తగినట్టుగా డ్రెస్‌ను ఎంపిక చేసుకునే స్పెషల్ డే కి స్పెషల్ లుక్.

యాక్సెసరీస్
ఔట్‌ఫిట్స్‌లో ట్రై కలర్స్‌కి నో చెప్పేవాళ్లు ఇతర అలంకరణలో ప్రత్యేకతను చూపవచ్చు. అందుకు ట్రై కలర్ గాజులు, బ్రేస్‌లెట్స్ మంచి ఎంపిక అవుతుంది. ట్రై కలర్స్‌లో నెయిల్‌పాలిష్ డిజైన్‌నూ ఎంచుకోవచ్చు.





జీన్స్ మీదకు గ్రీన్ కలర్ కుర్తా లేదా లాంగ్ ఓవర్ కోట్, ట్రై కలర్ జాకెట్ ధరించినా చాలు.



పూర్తి వైట్ గాగ్రా చోళీ లేదా మూడు రంగుల కలబోతగా మిక్స్ అండ్ మ్యాచ్ చేయచ్చు.

* * *

వైట్ కుర్తా మీదకు ట్రై కలర్ దుపట్టా ఒక మంచి ఎంపిక అవుతుంది. ప్రత్యేకంగానూ ఉంటుంది.



ఆరెంజ్ కలర్ శారీ, వైట్ కలర్ బ్లౌజ్ లేదా సేమ్ ఆల్ ఓవర్ ఒకే కలర్‌ని ఎంచుకోవచ్చు.



ప్రఖ్యాత డిజైనర్స్ సైతం తమ డిజైన్స్‌లో తెలుపు, పచ్చ, ఆరెంజ్‌ల ఒకే కలర్ కాన్సెప్ట్‌తో డిజైన్ చేస్తుంటారు. సందర్భాన్ని, బట్టి మిక్స్ అండ్ మ్యాచ్ కాంబినేషన్ ఔట్‌ఫిట్‌ను మనమే సొంతంగా రీ డిజైన్ చేసుకోవచ్చు.

ఆరోగ్యకారకం

వంటిల్లు

సంక్రాంతి రుచుల తియ్యటి రుచి బయటపడాలనిపిస్తోందా! నోటికి కారంగా, పొట్టకు తేలిగ్గా ఉండే ఆహారం తినాలనిపిస్తోందా. ఉన్నది ఆరు రుచులే... కానీ జిహ్వ మరింత రుచిని కోరుకుంటుంది. నాలుకకు మమకారం మాత్రమే కాదు రుచి కారమూ ఇష్టమే. పోపుల పెట్టెలో దినుసులన్నీ కలిపి రకరకాల కారం పొడులు చేద్దాం.

నువ్వుల పొడి



కావలసినవి: తెల్ల నువ్వులు – వంద గ్రాములు; ఎండు మిర్చి– 10; మినప్పప్పు – అర టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు– రుచికి తగినంత

తయారీ: ● మందపాటి బాణలిలో నువ్వులు వేసి మీడియం మంట మీద దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● మరొక బాణలిలో ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేయించి చివరగా జీలకర్ర వేసి దించేయాలి. ఇవన్నీ చల్లారిన తర్వాత మిక్సీ జార్‌లో నువ్వులు, పోపు దినుసులు, ఇంగువ, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. ఈ పొడిని అన్నం, ఇడ్లీ, ఉప్మాల్లో తినవచ్చు. కూరల్లో కలుపుకోవచ్చు. వేపుళ్లలో పైన చల్లుకోవచ్చు. ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కాబట్టి వారంలో కనీసం మూడు రోజులు ఆహారంలో ఈ పొడి ఉండేలా చూసుకోవడం మంచిది.

కొబ్బరి పొడి

కావలసినవి: ఎండుకొబ్బరి తురుము – వంద గ్రాములు; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; వేయించిన శనగపప్పు – టీ స్పూన్; మిరప్పొడి– టేబుల్ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: ● బాణలిలో పచ్చి శనగపప్పు వేసి దోరగా వేగిన తర్వాత వేయించిన శనగపప్పు, జీలకర్ర, వెల్లుల్లి, ఇంగువ,



కొబ్బరి తురుము వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత అన్నింటినీ మిక్సీ జార్‌లో వేసి మిరప్పొడి, ఉప్పు కలిపి పొడి చేయాలి. ఇడ్లీ, దోశలు, అన్నంలోకి బాగుంటుంది. వేపుళ్లలో ఒక టేబుల్ స్పూన్ పొడి కలిపితే రుచి ఇనుమడిస్తుంది.

కరివేపాకు పొడి



కావలసినవి: కరివేపాకు– వందగ్రాములు (మంచి నీటిలో శుభ్రం చేసి ఆరబెట్టి ఈనెలు తీసిన ఆకులు); ఎండు మిర్చి– పది; ఆవాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టేబుల్ స్పూన్; వేరుశనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; మిరియాలు – అర టీ స్పూన్; చింతపండు – అర అంగుళం పాయ; వెల్లుల్లి రేకలు – 4; ఇంగువ పొడి– పావు టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి వేరు శనగపప్పు, ఆవాలు, ఎండు మిర్చి, ధనియాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత మిరియాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించాలి. ఆకులో పచ్చిదనం పోయే వరకు చిన్న మంట మీద వేయించాలి. ఆకు వేగిన తర్వాత చింతపండు, ఇంగువ, వెల్లుల్లిరేకలు, ఉప్పు వేసి దించేయాలి. ● చల్లారే కొద్దీ ఆకు పెళపెళలాడుతుంది. పూర్తిగా చల్లారిన వెంటనే మిక్సీలో వేసి పొడి చేయాలి. రుచి చూసి అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవాలి. ఈ పొడి వేడి అన్నం, ఇడ్లీ, దోశల్లోకి రుచిగా ఉంటుంది. ఆకలి మందగించినప్పుడు, నోటికి ఏదీ రుచించనప్పుడు ఈ పొడి తింటే జీర్ణవ్యవస్థ క్రమబద్ధమవుతుంది.

గమనిక: చల్లారిన వెంటనే పొడి చేయకపోతే ఆలస్యమయ్యే కొద్దీ ఆకు మెత్తబడి పోతుంది. సరిగ్గా మెదగదు.

అవిశె గింజల పొడి



కావలసినవి: అవిశె గింజలు – వందగ్రాములు; ఎండు మిర్చి – పది; ఆవాలు – అర టీ స్పూన్; మిరియాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; వేరు శనగపప్పు – అర టేబుల్ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; ఇంగువ– అర టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: బాణలిలో అవిశె గింజలను మీడియం మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి. మరొక బాణలిలో ఎండుమిర్చి, ఆవాలు, ధనియాలు, వేరు శనగపప్పు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, మిరియాలు, కరివేపాకు వేసి వేయించాలి. దినుసులన్నీ చక్కగా వేగి మంచి వాసన వచ్చేటప్పుడు అవిశె గింజలు, ఇంగువ వేసి కలిపి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత మిక్సీ జార్‌లో వేసి ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఇది పూర్తిగా ఆరోగ్యకారకం. గుండె వ్యాధుల నివారణ, డయాబెటిస్ నియంత్రణకు డాక్టర్లు అవిశె గింజలను సూచిస్తున్నారు. రుచి కోసం చూడకుండా రోజూ ఒక స్పూన్ అన్నంలో లేదా బ్రేక్‌ఫాస్ట్‌లలో ఏదో ఒకరకంగా తీసుకోవడం మంచిది.

న్యూస్‌మేకర్
మైథిలీ ఠాకూర్

రామ సన్నిధిలో శబరి గీతం



అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సమయంలో మంత్రాలు, స్తోత్రాలతోపాటు భక్తి సంగీతం కూడా భక్తులను తన్మయత్వానికి గురి చేసింది. శంకర్ మహదేవన్, సోను నిగమ్ వంటి సీనియర్ గాయకులతో పాటు రామ సన్నిధిలో 'శబరి గీతం' వినిపించిన బిహార్ గాయని మైథిలీ ఠాకూర్ ప్రత్యేక ప్రశంసలు పొందింది. నరేంద్ర మోడీ ఆమె గురించే ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. ఆరేళ్ల వయసు నుంచి భక్తి సంగీతాన్ని వినిపిస్తున్న మైథిలీ ఠాకూర్ పరిచయం.

'శబరీ సవారి రాస్తా
ఆయేంగె రామ్‌జీ'...
(శబరి వీధుల్ని అలంకరిస్తోంది
రాముని రాక కోసం)...

అని పాడిన మైథిలీ ఠాకూర్ పాటను ప్రత్యేకంగా మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు ప్రధాని మోదీ. బాలక్ రామ్ ప్రాణ ప్రతిష్ఠ సమయంలో మైథిలీ ఠాకూర్ ఈ పాటను యూట్యూబ్‌లో విడుదల చేయడమే కాదు... ప్రాణప్రతిష్ఠ సమయంలో ఆలయప్రాంగణంలో రాముని భజనలు కూడా పాడింది. దేశం మొత్తంలో ఇలాంటి అవకాశం పొందిన అతి చిన్న వయసు గాయని మైథిలి. 21 ఏళ్ల వయసులో ఇంత గుర్తింపు పొందడానికి కారణం ఎడతెగని సాధన, సంగీతం పట్ల ఆరాధనే.

బిహార్ అమ్మాయి

మైథిలీ ఠాకూర్‌ది బిహార్‌లోని మధుబని. తండ్రి రమేష్ ఠాకూర్ భజన గాయకుడు. అందువల్ల బాల్యం నుంచి తండ్రితో పాటు భజనలు పాడేది మైథిలి. ఇంట్లో ఏదో ఒక సమయంలో రామ్‌సీతా కీర్తనలు కొనసాగుతుండేవి. మైథిలిని తన వారసురాలిగా చేయాలని తండ్రికి ఉండేది. అందుకుని పదేళ్ల వరకూ స్కూల్‌కే పంపకుండా సంగీతంలో సాధన చేయించాడు. అయితే మైథిలికి గుర్తింపు మాత్రం వెంటనే రాలేదు.

గెలుపూ ఓటమి

మైథిలి భవిష్యత్తు కోసం ఢిల్లీకి మకాం మార్చాడు తండ్రి. ఢిల్లీలోని బాలభవన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేరుగా ఆరవ తరగతిలో చేరిన మైథిలి మొదటిసారి స్కూల్ ముఖం చూడటం, అక్కడ ఇంగ్లిష్ రాక అవస్థ పడటం కొనసాగిస్తూనే సంగీతాన్ని సాధన చేసింది. ఢిల్లీలో మైథిలి కచ్చేరీలు చేసినా అందరికీ తెలిసేటంతటి పేరు రాలేదు. ఆ సమయంలోనే అంటే 11 ఏళ్ల వయసులో 'లిటిల్ చాంప్', 'ఇండియన్ ఐడల్ 2' వంటి రియాలిటీ షోస్‌కు వెళ్లి ఫెయిల్ అయ్యి తిరిగి వచ్చింది మైథిలి.



దశ తిరిగింది

2017లో కలర్స్ టీవీలో 'రైజింగ్ స్టార్' అనే సింగింగ్ రియాలిటీ షో మైథిలి దశ తిప్పింది. ఆ షోలో మైథిలి రన్నర్ అప్‌గా నిలిచింది. ముంబైలో ఈ షో చేసి తిరిగి వచ్చాక ఢిల్లీ నుంచే తాను లోకానికి తెలియాలనుకుంది. వెంటనే సోషల్ మీడియాలో తన పాటలను పోస్ట్ చేయడం మొదలెట్టింది. మైథిలికి ఇద్దరు తమ్ముళ్లు–రిషబ్, అయాచి ఉన్నారు. వారిద్దరు తబలా, డోలక్ వాయిస్తారు. మైథిలి హార్మోనియం వాయిస్తుంది. వీరు ముగ్గురు కలసి పాటల వీడియోలు రిలీజ్ చేయడం మొదలెట్టారు. పెద్ద హిట్ అయ్యాయి. సినిమా పాటలే కాకుండా బిహార్‌లోని జానపద సంగీతాన్ని, పంజాబీ, గుజరాతీ, కేసరియా, బజ్జిక వంటి సంగీత ధోరణులను వీడియోలుగా రిలీజ్ చేసింది మైథిలి. అంతేకాదు భజన సంగీతాన్ని కొనసాగించింది. ఇప్పుడు ఆమెకు యూట్యూబ్‌లో 20 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో లక్షల ఫాలోయెర్లు ఉన్నారు. ఆ ప్రఖ్యాతి మైథిలిని రాముని పాదాల వరకూ చేర్చింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	360	70,701
నిఫ్టీ ▽	102	21,353

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,571	▲	87
డోజోన్స్	37,874	▲	67
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,535	▲	8
డాక్స్	16,904	▲	14
షాంఘై	2,906	▲	85
నికాయ్	36,236	▲	10

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,312 ▽	279
బంగారం (99.5 స్వచ్ఛత)	62,062 ▽	278
వెండి (కేజీ)	71,299 ▽	227

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.63	107.21
€	యూరో	ఒకటి	89.49	94.85
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.58	56.84
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.19	62.63
SAR	సౌదీ రియాల్	ఐదుసార్లకి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదుసార్లకి	21.73	23.53
¥	చైనా యువాన్	ఐదుసార్లకి	10.47	12.54

కుమారులకు 'ప్రేమ్'జీ కానుక

కోటి విప్రో షేర్లు బదిలీ



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో లిమిటెడ్ వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ తన కుమారులకు కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాను కానుకగా ఇచ్చారు. 1.02 కోట్ల ఈక్విటీ షేర్లను రిషద్ ప్రేమ్‌జీ, తారిఖ్ ప్రేమ్‌జీ పేరున బదిలీ చేశారు. విప్రో షేరు ప్రస్తుత మార్కెట్ ధర రూ. 470 ప్రకారం వీటి విలువ దాదాపు రూ. 480 కోట్లు. ప్రస్తుతం రిషద్ ప్రేమ్‌జీ.. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'నా వద్దగల 1,02,30,180 విప్రో షేర్లను రిషద్, తారిఖ్‌లకు కానుకగా బదిలీ చేస్తున్నాను' అంటూ అజీమ్ హెచ్ ప్రేమ్‌జీ తెలియజేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో తాజాగా సమాచారమిచ్చింది. ఇది కంపెనీ ఈక్విటీలో 0.2 శాతం వాటాకాగా.. దీంతో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ వాటాలలో ఎలాంటి మార్పులూ చోటుచేసుకోబోవని విప్రో వివరించింది.

హిండెన్‌బర్గ్ ఉదంతానికి ఏడాది

పటిష్టంగా ఎదిగాం..

- రూ. 40 వేల కోట్లు సమీకరించాం; రుణభారం తగ్గించుకున్నాం
- పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రారంభించాం
- అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ



న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఉదంతంతో గత ఏడాది కాలంగా ఎదురైన పరీక్షలు, సవాళ్లు తమ గ్రూప్‌ను మరింత బలోపేతం చేశాయని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. అన్నింటినీ తట్టుకుని వృద్ధి బాటలో ముందుకు సాగామని, ధారావి సహా పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించామని ఆయన వివరించారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో, షేర్లలో అవకతవకలు జరుగుతున్నాయన్న అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదిక .. గతేడాది అదానీ సంస్థలను కుదిపేసిన సంగతి తెలిసిందే. ఈ ఉదంతం చోటు చేసుకుని ఏడాది అయిన సందర్భంగా రాసిన కాలమ్‌లో గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. గత ఏడాది వ్యవధిలో అదానీ గ్రూప్ కొన్ని సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా వచ్చే రెండేళ్ల పాటు రుణాల చెల్లింపునకు సరిపోయేంత స్థాయిలో ఏకంగా రూ. 40,000 కోట్లు సమీకరించిందని ఆయన వివరించారు. అలాగే, మార్జిన్ ఆధారిత ఫైనాన్సింగ్‌కి సంబంధించి రూ. 17,500 కోట్లు తిరిగి చెల్లించేశామని, రుణభారాన్ని తగ్గించుకున్నామని, తమ అసెట్ బేస్ రూ. 4.5 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. కార్యకలాపాలపై మరింతగా దృష్టి పెట్టడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో అత్యధిక స్థాయి త్రైమాసిక లాభాలను ఆర్జించామన్నారు. గ్రూప్‌లో భాగమైన లిస్టెడ్ సంస్థల్లో చాలా మటుకు కంపెనీలు, హిండెన్‌బర్గ్ వివాదంతో వాటిల్లిన నష్టాలను భర్తీ చేసుకోగలిగాయని అదానీ పేర్కొన్నారు. తాము మోసానికి, స్టాక్ మార్కెట్లో అవకతవకలకు పాల్పడ్డామన్న హిండెన్‌బర్గ్ నివేదిక అబద్ధాలపుట్ట అని ఆయన ఆక్షేపించారు. తమ ప్రత్యర్థులు ఎప్పటివో పాతబడిన ఆరోపణలకు మళ్లీ తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారన్నారు. "చచ్చు ఆరోపణలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారం నుంచి సేకరించిన అర్ధ సత్యాలను ఎంపిక చేసుకుని (హిండెన్‌బర్గ్) అబద్ధాల పుట్టను 'పరిశోధన నివేదిక'గా వండి వడ్డించింది. మా స్పందనను తెలియజేశాక నేను దాని గురించి ఇక పట్టించుకోలేదు. కానీ (ఆ తర్వాత పరిణామాలతో) సత్యం చెప్పుల్లో కాళ్లు పెట్టే లోపలే అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుందనే విలువైన పాఠాన్ని ఈ ఉదంతంతో తెలుసుకున్నాను. మాపై ఆర్థికంగానూ, రాజకీయ కోణంలోనూ దాడి జరిగింది. మా వ్యాపార పటిష్టతపై మాకు ఉన్న విశ్వాసమే వ్యూహంగా వాటిని ఎదుర్కొన్నాం" అని అదానీ పేర్కొన్నారు.

చిన్న ఇన్వెస్టర్లు నష్టపోవడం బాధించింది..


"సాధారణంగా క్యాపిటల్ మార్కెట్లు హేతుబద్ధంగా కన్నా ఎక్కువగా భావోద్వేగాలతో పని చేస్తాయి. మాపై వచ్చిన తీవ్ర స్థాయి అబద్ధాలు మార్కెట్ క్యాప్‌ను గణనీయంగా హరించేశాయి. అన్నింటి కన్నా ఎక్కువగా వేల మంది చిన్న ఇన్వెస్టర్లు తాము దాచుకున్న సొమ్మును పోగొట్టుకోవడం నన్ను ఎంతో బాధించింది. విరోధుల ప్రణాళికలు పూర్తిగా విజయవంతమై ఉంటే దాని ప్రభావం.. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ వరకు ఎన్నో కీలక మౌలికసదుపాయాలను దెబ్బతీసేది. ఏ దేశానికైనా ఇది పెను విపత్తే" అని అదానీ తెలిపారు. గతేడాది ప్రారంభంలో ప్రపంచంలోనే 2వ అత్యంత సంపన్నుడిగా వెలిగిన అదానీ.. హిండెన్‌బర్గ్ నివేదిక పరిణామాలతో ఒక దశలో టాప్ 20 జాబితాలో కూడా చోటు కోల్పోయారు. ప్రస్తుతం 14వ స్థానంలో ఉన్నారు.

ఇన్వెస్టర్లు షం'షేర్'..!

గతేడాది భారీగా నమోదు

దేశవ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా ఈక్విటీ పెట్టుబడుల వైపు అడుగులు వేస్తున్నారు. మార్కెట్ల ర్యాలీ కూడా వారిని ఆకర్షిస్తోంది. ఇందుకు నిదర్శనంగా బీఎస్‌ఈలో రిజిస్టర్డ్ ఇన్వెస్టర్ల సంఖ్య 2023లో 27 శాతం పెరిగి 3.3 కోట్లకు చేరింది. ముఖ్యంగా బిహార్‌లో 42 శాతం, యూపీలో 41 శాతం మేర కొత్త ఇన్వెస్టర్లలో వృద్ధి కనిపించింది. గతేడాది సెన్సెక్స్ 19 శాతం, నిఫ్టీ 50 సూచీలు 20 శాతం మేర ర్యాలీ చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఇంతకంటే అధిక రాబడిని ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడిని సర్దుబాటు చేసుకునే స్థాయిలో దేశీ పెట్టుబడులు పెరుగుతుండడం గమనార్హం. ఆధార్, పాన్‌తో సులభంగా కొత్త ఖాతాల ప్రారంభం, మొబైల్ మంచే లావాదేవీలకు వీలుగా ట్రేడింగ్ అప్లికేషన్లు, యూపీఐ తదితర సాధనాలతో సులభ చెల్లింపులు ఈ జోరుకు మద్దతునిస్తున్నాయి. గతేడాది డీమ్యాట్ ఖాతాలు సైతం 43 శాతం పెరిగి 11.45 కోట్లకు చేరాయి. అయినా ఇప్పటికీ దేశ జనాభా 140 కోట్లలో ఆర్థిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు కేవలం 8 శాతంగానే ఉండడాన్ని గమనించాలి.

ఏపీ నుంచి 61.8లక్షల మంది, తెలంగాణ నుంచి 47.1 లక్షల మంది ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు.



ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- 21,400 స్థాయి దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్‌కు 360 పాయింట్ల నష్టం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



మార్కెట్లు సెలవు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీలు పనిచేయవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు.

ముంబై: ఫైనాన్స్, ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం అరశాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 360 పాయింట్లు నష్టపోయి 70,701 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102 పాయింట్లు పతనమై 21,353 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం స్తబ్దుగా మొదలయ్యాయి. జనవరి ఎఫ్అండ్ఓ కాంట్రాక్టు ముగింపు సందర్భంగా ట్రేడర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 741 పాయింట్లు క్షీణించి 70,319 వద్ద, నిఫ్టీ 207 పాయింట్లు పతనమై 21,247 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అయితే ట్రేడింగ్ చివర్లో మెటల్, సర్వీసెస్, పవర్, వినిమయ ఆటో, మీడియా షేర్లకు అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు సగానికిపైగా నష్టాలు భర్తీ చేసుకున్నాయి. అమెరికా పటిష్ట ఆర్థిక డేటా వెల్లడితో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు వాయిదా ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 60% క్షీణించడంతో టెక్ మహీంద్రా షేరు 6% నష్టపోయి రూ.1,322 వద్ద స్థిరపడింది.
- ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బజాజ్ ఆటో షేరు పరుగులు పెట్టింది. 5% పెరిగి రూ.7,597 వద్ద స్థిరపడింది.
- టెక్ మహీంద్ర పతన ప్రభావంతో, కోఫోర్జ్ 3%, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 1 నుంచి అరశాతం నష్టపోయాయి.

వేదాంతా క్యూ3 లాభం క్షీణత

రూ. 2,013 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 2,013 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,464 కోట్లు ఆర్జించింది. ఫైనాన్స్, ముడి సరుకుల వ్యయాలు పెరగడం, అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ. 34,818 కోట్ల నుంచి రూ. 36,320 కోట్లకు ఎగసింది. ఫైనాన్స్ వ్యయాలు 54 శాతం పెరిగి రూ. 2,417 కోట్లను తాకాయి. కాగా.. త్రైమాసికవారీగా ఈ క్యూ3 అత్యుత్తమమని కంపెనీ సీఎఫ్‌వో అజయ్ గోయెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 0.4 శాతం బలపడి రూ. 264 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ లాభం రూ. 2,223 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం మూడు రెట్లు పైగా దూసుకెళ్లి రూ.2,223 కోట్లను తాకింది. గత 15 క్వార్టర్లలో ఇది అత్యధికం కాగా.. ఇందుకు అధిక వడ్డీ ఆదాయం, మెరుగుపడిన రుణ నాణ్యత సహకరించాయి. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 629 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 25,722 కోట్ల నుంచి రూ. 29,962 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 12 శాతం ఎగసి రూ. 10,293 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 9.76 శాతం నుంచి 6.24 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 3.3 శాతం నుంచి 0.96 శాతానికి భారీగా దిగివచ్చాయి. నికర వడ్డీ మార్జిన్లు 3 శాతం నుంచి 3.11 శాతానికి మెరుగయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం బలపడి రూ. 105 వద్ద ముగిసింది.



క్వార్టర్ ఫైనల్లో భారత్

మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మస్కట్‌లో నమీబియాతో జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 7–2తో గెలిచింది. . నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.



కిరణ్ జార్జి సంచలనం

ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్, ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–11, 13–21, 21–18తో ప్రపంచ 18వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్, ప్రియాన్షు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

భారత్ 'స్పిన్ బాల్'... ఆపై జైస్వాల్...

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 246 ఆలౌట్
- ఆదుకున్న బెన్ స్టోక్స్
- భారత్ 119/1
- యశస్వి జైస్వాల్ అర్ధసెంచరీ

'బజ్‌బాల్'... దూకుడైన ఆటకు మారు పేరు అంటూ ఇంగ్లండ్ జట్టు గత కొంత కాలంగా ప్రచారం చేసింది. అయితే భారత్‌లో ఇది సాధ్యమా అనే సందేహాలు వినిపించాయి. ఇంగ్లండ్ ఆశించినట్లుగా ఆ ధాటి పని చేసింది... అయితే అది తొలి ఎనిమిది ఓవర్ల వరకే... ఆ తర్వాత భారత 'స్పిన్ బాల్' దెబ్బకు లెక్క మారిపోయింది... వరుసగా వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ చివర్లో స్టోక్స్ ఆదుకోవడంతో కాస్త కోలుకుంది. అక్కడక్కడ ఇంగ్లండ్ కాస్త మెరుగైన స్థితిలోనే నిలిచినా చివరకు సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఆపై మన గడ్డపై 'బజ్‌బాల్' ఎలా ఆడాలో భారత ఓపెనర్లు చూపించారు. యశస్వి ధాటికి ఆరంభంలో స్కోరు ఆరుకు పైగా రన్‌రేట్‌తో సాగింది. తొలి రోజే ప్రత్యర్థి స్కోరులో దాదాపు సగం స్కోరును జట్టు అందుకుంది... మొత్తంగా అన్ని విధాలా మొదటి రోజు మనదిగా ముగిసింది.



స్టోక్స్ క్లీన్‌బౌల్డ్



అక్షర్, జడేజా, అశ్విన్, బుమ్రా

సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజు పైచేయిని ప్రదర్శించింది. టాస్ ఓడిపోవడం మినహా దాదాపు మిగతా రోజంతా టీమిండియాకే అనుకూలంగా సాగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 64.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (88 బంతుల్లో 70; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా... బెయిర్‌స్టో (58 బంతుల్లో 37; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు అశ్విన్, జడేజా చెరో 3 వికెట్లు పడగొట్టగా...అక్షర్ పటేల్ ఖాతాలో 2 వికెట్లు చేరాయి. పేసర్ బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 119 పరుగులు సాధించింది. యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా... రోహిత్ శర్మ (27 బంతుల్లో 24; 3 ఫోర్లు) రాణించాడు. ప్రస్తుతం భారత్ మరో 127 పరుగులు వెనుకబడి ఉండగా... క్రీజులో యశస్వితో పాటు గిల్ (43 బంతుల్లో 14 బ్యాటింగ్; 1 ఫోర్) ఉన్నాడు. నేడు రెండో రోజు పూర్తిగా బ్యాటింగ్ చేసి టీమిండియా భారీ స్కోరు సాధిస్తే మ్యాచ్ చేతుల్లోకి వచ్చినట్లే.

ఓపెనర్ల శుభారంభం...



యశస్వి

బుమ్రా, సిరాజ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ క్రాలీ (40 బంతుల్లో 20; 3 ఫోర్లు), డకెట్ (39 బంతుల్లో 35; 7 ఫోర్లు) వేగంగా పరుగులు రాబట్టారు. 8 ఓవర్లలో వీరు 41 పరుగులు జత చేశారు. తర్వాతి ఓవర్ జడేజా మెయిడిన్‌గా వేయడంతో దూకుడుకు అడ్డుకట్ట పడింది. అశ్విన్, జడేజా చెలరేగడంతో 5 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఈ దశలో రూట్ (60 బంతుల్లో 29; 1 ఫోర్), బెయిర్‌స్టో కలిసి 61 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. అయితే 4 పరుగుల వ్యవధిలో వీరిద్దరు వెనుదిరిగారు. అక్షర్ అద్భుత బంతితో బెయిర్‌స్టోను బౌల్డ్ చేయగా, రూట్ స్వయంకృతంతో వెనుదిరిగాడు. 137/6తో ఇన్నింగ్స్ ముగిసేందుకు ఇంగ్లండ్ చేరువైంది. అయితే స్టోక్స్ తన విలువను చూపించాడు. ఈ స్థితిలో స్టోక్స్ స్కోరు 8 పరుగులు మాత్రమే. కానీ టెయిలెండర్ల సహాయంతో అతను చెలరేగిపోయాడు. జట్టు సాధించిన తర్వాతి 109 పరుగుల్లో 62 అతని బ్యాట్ నుంచే రాగా... హార్లీ (24 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) తన కెప్టెన్సీకు అండగా నిలిచాడు. జడేజా ఓవర్లో స్టోక్స్ వరుస బంతుల్లో కొట్టిన రెండు సిక్సర్లు, అతని ఓవర్లోనే బాదిన మూడు ఫోర్లు హైలైట్‌గా నిలిచాయి. చివరకు చక్కటి బంతితో స్టోక్స్ ఆటను బుమ్రా కట్టించాడు. తొలి రెండు సెషన్లలో వందకు పైగా పరుగులు సాధించి ఇంగ్లండ్ మెరుగ్గానే ఆడినా... చివరకు వచ్చేసరికి ఆ జట్టు ఆశించిన భారీ స్కోరు మాత్రం సాధ్యం కాలేదు.

మెరుపు ఆరంభం...


వుడ్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌తో మొదలు పెట్టిన యశస్వి, అరంగేట్ర బౌలర్ హార్లీ తొలి టెస్టు బంతిని సిక్సర్ బాది స్వాగతం పలికాడు. మరోవైపు రోహిత్ అండగా నిలవడంతో 6.3 ఓవర్లలోనే టీమిండియా స్కోరు 50 పరుగులకు చేరింది. అనంతరం 47 బంతుల్లోనే యశస్వి అర్ధ సెంచరీ పూర్తయింది. అయితే జట్టుకు అంతా అనుకూలంగా ఉండి టెస్టులో ఇంకా ఎంతో సమయం మిగిలి ఉన్నా... అనవసరంగా అత్యుత్సాహానికి పోయి చెత్త షాట్ ఆడిన రోహిత్ వికెట్ పారేసుకున్నాడు. అనంతరం గిల్ బాగా జాగ్రత్త ప్రదర్శించడంతో వేగం తగ్గింది. అయినా చివరకు 5.17 రన్‌రేట్‌తో భారత్ రోజును ముగించింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20; డకెట్ (ఎల్బీ) (బి) అశ్విన్ 35; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1; రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29; బెయిర్‌స్టో (బి) అక్షర్ 37; స్టోక్స్ (బి) బుమ్రా 70; ఫోక్స్ (సి) భరత్ (బి) అక్షర్ 4; రేహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 13; హార్లీ (బి) జడేజా 23; వుడ్ (బి) అశ్విన్ 11; లీచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (64.3 ఓవర్లలో ఆలౌట్) 246. వికెట్ల పతనం: 1–55, 2–58, 3–60, 4–121, 5–125, 6–137, 7–155, 8–193, 9–234, 10–246. బౌలింగ్: బుమ్రా 8.3–1–28–2, సిరాజ్ 4–0–28–0, జడేజా 18–4–88–3, అశ్విన్ 21–1–68–3, అక్షర్ 13–1–33–2. భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (బ్యాటింగ్) 76; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (23 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119. వికెట్ల పతనం: 1–80. బౌలింగ్: వుడ్ 2–0–9–0, హార్లీ 9–0–63–0, లీచ్ 9–2–24–1, రేహాన్ 3–0–22–0.

టైటిల్ పోరుకు బోపన్న జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ



మెల్‌బోర్న్: తన కెరీర్‌లో అందని ద్రాక్షగా ఉన్న పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించేందుకు భారత స్టార్ రోహన్ బోపన్నకు మరో అవకాశం లభించింది. గతంలో రెండుసార్లు (2013, 2023) యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్న బోపన్న...తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన సెమీ ఫైనల్లో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–3, 3–6, 7–6 (10/7)తో టామస్ మెచాక్ (చెక్ రిపబ్లిక్)–జిజెన్ జాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో సిమోన్ బొలెలీ–ఆండ్రియా వవాసోరి (ఇటలీ) ద్వయంతో బోపన్న–ఎబ్డెన్ జంట తలపడుతుంది.

ఫైనల్లో సబలెంకా, కిన్‌వెన్ జెంగ్

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్), 12వ సీడ్ కిన్‌వెన్ జాంగ్ (చైనా) ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో సబలెంకా 7–6 (7/2), 6–4తో నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలుపొందగా... కిన్‌వెన్ జాంగ్ 6–4, 6–4తో క్వాలిఫయర్ డయానా యాస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్)ను ఓడించింది.

కోహ్లికి నాలుగోసారి...

ఐసీసీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గిన భారత స్టార్



దుబాయ్: భారత మేటి క్రికెటర్ విరాట్ కోహ్లి 2023 సంవత్సరానికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్నాడు. గత ఏడాది కోహ్లి 27 వన్డేలు ఆడి 1377 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు సెంచరీలు, ఎనిమిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కోహ్లి 11 మ్యాచ్‌ల్లో 765 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు దక్కించుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు నెగ్గడం కోహ్లికిది నాలుగోసారి. గతంలో 2012, 2017, 2018లలో కూడా కోహ్లికి ఈ పురస్కారం లభించింది. 2018లో కోహ్లి 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'తో పాటు 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'... 2017లో 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు పొందాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు 2023 సంవత్సరానికి 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ... ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజాకు 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కాయి.



ముషీర్ ఖాన్

యువభారత్ ఘనవిజయం

ముషీర్ ఖాన్ సెంచరీ • రాణించిన ఉదయ్

బ్లూమ్‌ఫొంటెన్ (దక్షిణాఫ్రికా): అండర్–19 వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఐర్లాండ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 201 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముషీర్ ఖాన్ (106 బంతుల్లో 118; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేయగా... కెప్టెన్ ఉదయ్ సహారణ్ (84 బంతుల్లో 75; 5 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 156 పరుగులు జోడించారు. 302 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు 29.4 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లు నమన్ తివారి (4/53), సౌమీ పాండే (3/19) ఐర్లాండ్‌ను దెబ్బతీశారు. భారత్ తమ చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌ను ఆదివారం అమెరికా జట్టుతో ఆడుతుంది.

యువర్స్

నవతరం వందేమాతరం

కొన్ని తరాల వెనక్కి వెళితే...యువతలో దేశభక్తి వ్యక్తీకరణ పద్యం, పాట, కవిత, నినాదాల రూపంలో కనిపించేది. ఇక నేటి యువత విషయానికి వస్తే... సోషల్ మీడియా క్యాంపెయిన్స్, డిజిటల్ ఎంగేజ్‌మెంట్, వర్చువల్ ఎడ్యుకేషనల్ కంటెంట్ ద్వారా తమలోని దేశభక్తిని చాటుకుంటున్నారు...



దేశభక్తి భావాలను డిజిటల్ ప్రపంచంలోకి తీసుకువచ్చింది యువత. ఒకప్పుడు మన దేశానికి మాత్రమే పరిమితమైన దేశాభిమాన భావాలు ఇప్పుడు ఇంటర్నెట్ పుణ్యమా అని విశ్వవ్యాప్తం అవుతున్నాయి.

ఆనాటి స్వాతంత్య్ర ఉద్యమ వీరోచిత పోరాటగాధలను సోషల్ మీడియా వేదికగా యువత గుర్తు తెచ్చుకుంటుంది. కంటెంట్ క్రియేషన్ ద్వారా కూడా తమలోని దేశభక్తి భావాలను సృజనాత్మకంగా ఆవిష్కరిస్తున్నారు.

'జెన్-జెడ్ ఆర్టిస్టులు తమలోని దేశభక్తి భావాలను పాటలు, చిత్రాల రూపంలో ఆవిష్కరిస్తున్నారు. ప్రపంచ ధోరణులను గమనిస్తూ, విశ్లేషిస్తూనే కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి దేశీయతకు ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటుంది కంటెంట్ క్రియేటర్ జాహ్నవి తివారి.

బెంగళూరుకు చెందిన 23 సంవత్సరాల ప్రణవ్ స్కూల్ రోజుల్లో 'హిస్టరీ రొన్ను కంటే రెస్టు మేలు' అన్నట్లుగా ఉండేవాడు. బోర్‌గా ఫీలయ్యేవాడు. అయితే ఇప్పుడు హిస్టరీ అనేది అతడి ఫేవరెట్ సబ్జెక్ట్. హిస్టరీ పుస్తకాలను ఇష్టంగా చదువుతుంటాడు. ది డిస్కవరీ ఆఫ్ ఇండియా, ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్, ది లాస్ట్ మొఘల్, ది వండర్ దట్ వాజ్ ఇండియా...మొదలైనవి అతడి అభిమాన పుస్తకాలు.

'ఒక దేశ గొప్పదనం గురించి తెలుసుకోవాలంటే ఆ దేశచరిత్ర తెలుసుకోవాలి అనే మాట విని చరిత్ర పుస్తకాలపై ఆసక్తి పెరిగింది. బుక్‌లెట్‌లాంటి చిన్న పుస్తకాలతో మొదలు పెట్టి ఇప్పుడు వందల పేజీలు ఉన్న పెద్ద పుస్తకాలు కూడా చదువుతున్నాను' అంటున్నాడు ప్రణవ్.

'దేశాన్ని ముందుకు నడిపించే ప్రతి మంచిపని దేశభక్తిగానే పరిగణించాలి. పర్యావరణ స్పృహ నుంచి స్పోర్ట్స్ వరకు ఏదైనా కావచ్చు' అంటున్న ముంబైకి చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ తేజస్వీ పర్యావరణ హిత, సామాజిక స్పృహకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది. ఇక సినిమాలకు సంబంధించి 'యే జో దేశ్ హై తేరా, స్వదేశ్ హై తేరా' (స్వదేశ్), ఆప్నీ అజాదీ కో (లీడర్-1964), యే మేరా ఇండియా-ఐ లవ్ మై ఇండియా (పర్‌దేశ్)...మొదలైన పాటలను ఎక్కువగా షేర్ చేస్తుంటారు. జీ మ్యూజిక్ కంపెనీ 'సలామ్ ఇండియా' 'భారత్ సలామ్' టీ-సీరిస్ 'ఇండిపెండెన్స్ డే స్పెషల్ టప్స్ 'ఇండిపెండెన్స్ డే సాంగ్స్' సారేగామా మ్యూజిక్ 'రిపబ్లిక్ డే స్పెషల్' నైంటీస్ గానే 'ఐ లవ్ మై ఇండియా-రిపబ్లిక్ డే సాంగ్స్' ఆల్బమ్‌లకు యూట్యూబ్‌లో యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

సింగర్-సాంగ్ రైటర్ వినీత్ సింగ్ మ్యూజిక్ ఇండస్ట్రీలో రికార్డ్‌లు బ్రేక్ చేయడంలో ఘనాపాటి. 'యూరోపియన్ టాప్ 100 రేడియా చార్ట్స్'లో అతడి పాటలు టాప్‌లో నిలిచాయి. కొత్త దేశభక్తి గీతం 'బార్న్ ఇన్ భారత్, బార్న్ ఫర్ ఇండియా'తో ముందుకు వచ్చాడు వినీత్. డైనమిక్ వోకల్స్, ఎనర్జిటిక్ బేస్‌లైన్‌తో కూడిన ఈ పాట నవభారతాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది.

'దేశభక్తి పాటలు స్ఫూర్తిని ఇస్తాయి. దేశానికి నా వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పాన్ని ఇస్తాయి' అంటున్న ఢిల్లీకి చెందిన అద్విక్ దేశభక్తి పాటలు పాడడంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. 'దేశభక్తి గీతాలు కొన్ని రోజులకు మాత్రమే పరిమితమైనవి కావు. అన్ని రోజుల్లో వినాల్సిన విలువైన గీతాలు' అంటాడు 24 సంవత్సరాల అద్విక్.

స్ఫూర్తిదాయక ఏఐ శకటం



ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖకు సంబంధించిన ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శకటాన్ని ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. కృత్రిమ మేధ(ఏఐ)లో మన దేశం సాధించిన పురోగతికి అద్దం పట్టేల, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, విద్య, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్చరింగ్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని ప్రతిఫలించేలా ఈ శకటాన్ని తీర్చిదిద్దారు. శకటంలో ఒక మహిళా రోబోట్ కృత్రిమ మేధస్సును ప్రతిబింబించేలా ఉంటుంది. వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల్లో కీలకమైన సెమీకండక్టర్ చిప్ 3డీ మోడల్‌ను శకటంలోఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో భారతదేశ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాన్ని తెలియజేసేలా శకటానికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించిన సర్క్యూట్ డిజైన్ ఆకట్టుకుంటుంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్(పీఎల్ఐ)లాంటి కార్యక్రమాల ద్వారా ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్‌లో మన దేశం సాధించిన పురోగతిని కూడా ఈ శకటం హైలెట్ చేస్తుంది. శకటం మధ్య విభాగంలో లాజిస్టిక్స్‌పై దృష్టి పెట్టారు. కలర్ కోడింగ్ ఆధారంగా పార్శిల్ గుర్తింపు, విభజనకు సాంకేతికత ఎలా సహాయపడుతుందో తెలియజేసేలా ఉంటుంది. శకటం వెనుక భాగం విద్యారంగంపై దృష్టిని మళ్లిస్తుంది. వీఆర్ హెడ్‌సెట్ ధరించి వర్చువల్ రియాలిటీ ద్వారా రిమోట్ క్లాసును నిర్వహించే ఉపాధ్యాయుడి లార్జర్ దెన్ లైఫ్ స్టాచ్యూ ఉత్తేజకరంగా ఉంటుంది. పశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడంలో సెన్సర్‌ల ద్వారా ఏఐ అప్లికేషన్‌ల ఉపయోగం, నావిగేషన్‌కు సంబంధించి దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సహాయపడే విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారాన్ని ఈ ఏఐ శకటం హైలెట్ చేస్తుంది.

అవును... ఇది నిజమే!

● 'రిపబ్లిక్‌డే జనవరి 26న ఎందుకు జరుపుకుంటామో తెలుసా?' అనే ప్రశ్నకు...'1950, జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది కాబట్టి' అని చెబుతాం. ఇది నిజమే అయినప్పటికీ అసలు కారణం వేరు. భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న ఆమోదించారు. అయితే రాజ్యాంగాన్ని అమలు చేసే తేదీకి ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో జనవరి 26ని ఎంపిక చేసుకున్నారు.

జనవరి 26 ప్రాముఖ్యత ఏమిటి?

1930 జనవరి 26న లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్య తీర్మానం చేశారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న 'జనవరి 26'కి చిరస్థాయి కల్పించాలనే ఉద్దేశంతో 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చారు

● రాజ్యాంగం అసలు ప్రతిని ప్రేమ్ బిహారి నారాయణ్ రైజాదా తన అందమైన చేతి రాతతో హిందీ, ఇంగ్లీష్‌లలో రాశారు. రాయడానికి ఆరు నెలల సమయం తీసుకుంది.

● తొలి రిపబ్లిక్ పరేడ్ (1950) ఢిల్లీలోని ఇర్విన్ యాంఫీథియేటర్ (ప్రస్తుతం మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియం)లో జరిగింది.

● రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న తొలి విదేశీ సైనిక బృందం...ఫ్రెంచ్ ఆర్మీ సైనికులు (2016).

● ఫస్ట్ రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరైన ఫస్ట్ చీఫ్ గెస్ట్ ఇండోనేషియా ప్రెసిడెంట్ సుకర్నో



● టెక్.. టాక్

ఒప్పో ప్యాడ్ నియో



సైజ్: 11.4 అంగుళాలు
రిజల్యూషన్: 2408X1720
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
బరువు: 538 గ్రా.
ఓఎస్: ఆండ్రాయిడ్ 13
కలర్: గ్రే

రెడ్‌మీ నోట్ 13 ప్రో 4జీ



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు
రిజల్యూషన్: 1080X2400 పిక్సెల్స్
మెమరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ

సినిమా

కారైకుడిలో మిస్టర్ బచ్చన్


● రవితేజ

కారైకుడికి వెళ్లారు 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. పనోరమా స్టూడియోస్, టీ-సిరీస్ సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. కాగా 'మిస్టర్ బచ్చన్' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ తమిళనాడులోని కారైకుడిలో ప్రారంభమైంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ-నిర్మాతగా ఉన్న ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త.

ఇస్మార్ట్ మ్యూజిక


● రామ్

'డబుల్ ఇస్మార్ట్' మ్యూజిక్ సిట్టింగ్స్ జోరందుకున్నాయి. 'ఇస్మార్ట్ శంకర్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ మొదలయ్యాయి. ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేసి, 'డబుల్ ఇస్మార్ట్' అప్‌డేట్‌ను వెల్లడించింది చిత్రబృందం. 'ఇస్మార్ట్ శంకర్'కు సంగీతం అందించిన మణిశర్మనే సీక్వెల్‌కూ సంగీతం అందిస్తున్నారు. గతంలోనూ పూరి-మణిశర్మ కాంబినేషన్‌లో 'పోకిరి' వంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్ వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా క్లైమాక్స్ పోర్షన్స్ చిత్రీకరణ కోసం దాదాపు 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా సమాచారం. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను మార్చి 18న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ గతంలో ప్రకటించింది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ తాజా కబురు.


● నాగార్జున, విజయ్ బిన్నీ, 'అల్లరి' నరేశ్, శ్రీనివాసా చిట్టూరి

అలా సినిమాలు తీయడం సులభం కాదు - నాగార్జున

''నేను దాదాపు 95మందికి పైగా దర్శకులతో పని చేశాను. చక్కని క్లారిటీతో సినిమాలు చేసే కొద్దిమంది దర్శకుల్లో విజయ్ ఒకరు అని నాకనిపించింది. 'నా సామిరంగ' మూవీని ఓ పాటలా అందంగా తీసి, కొరియోగ్రాఫర్ అనిపించుకున్నాడు. సినిమాకి ఎంత కావాలో సరిగ్గా అంతే తీశాడు. ఇలా తీయడం అంత సులభం కాదు'' అని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ ధిల్లాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. 'నా సామిరంగ' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ - టీవీ డ్యాన్సర్స్ - డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్లు కలిసి విజయ్ బిన్నీని సన్మానించాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ- ''ఈ వేడుకకు రావడాన్ని ఓ గౌరవంగా భావిస్తున్నాను. మీ అందరి చిరునవ్వులు చూస్తుంటే మనసు ఆనందంతో పొంగిపోయింది. విజయ్‌తో వండర్‌ఫుల్ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్'' అన్నారు. మరో అతిథి 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ- ''దర్శకుడిని కావాలనుకున్న తన కలను సక్సెస్‌ఫుల్‌గా నెరవేర్చుకున్నారు విజయ్. ఇక్కడున్న డ్యాన్స్ మాస్టర్స్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''నాగార్జునగారు నన్ను దర్శకుడిగా ఎంచుకోవడం నా అదృష్టం'' అన్నారు విజయ్ బిన్నీ. ''విజయ్ గారు డైరెక్టర్‌గా గొప్ప విజయాన్ని అందుకోవడం మా అందరికీ గర్వకారణం'' అన్నారు శేఖర్ మాస్టర్.

ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు భవతారణి కన్నుమూత




ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆయన కుమార్తె, గాయని భవతారణి రాజా (47) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ గురువారం రాత్రి శ్రీలంకలో కన్నుమూశారు. నేడు ఆమె భౌతికకాయాన్ని చెన్నైకు తీసుకురానున్నారు. శుక్రవారమే అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది. ఇళయరాజాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీత దర్శకులు. కుమార్తె భవతారణి సంగీత దర్శకురాలిగా, గాయనిగా రాణిస్తున్నారు.

మలయాళ త్రీడీ 'మై డియర్ కుట్టి చాత్తాన్' (1984) గాయనిగా భవతారణికి తొలి చిత్రం. ప్రభుదేవా హీరోగా నటించిన 'రాసయ్య' (1995) చిత్రం ద్వారా గాయనిగా కోలీవుడ్‌కి పరిచయమయ్యారు భవతారణి. అదే విధంగా 'భారతి' (2000) చిత్రంలోని 'మైలు పోల పొన్ను..' అనే పాటకు గాను జాతీయ ఉత్తమ గాయనిగా కేంద్ర ప్రభుత్వ అవార్డును అందుకున్నారామె. తెలుగులోనూ పలు పాటలు పాడారు. తండ్రి, సోదరుల సంగీత దర్శకత్వంలో అనేక పాటలను పాడారు భవతారణి. దాదాపు పాతిక చిత్రాల్లో పాటలు పాడారు.

తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'గుండెల్లో గోదారి' సినిమాలో 'నన్ను నీతో..' పాటను పాడారామె. మెలోడీ పాటలతో సంగీత అభిమానుల హృదయాలలో చోటు దక్కించుకున్నారు. 2002లో నటి రేవతి దర్శకురాలిగా తెరకెక్కించిన తొలి చిత్రం 'మిత్ర్: మై ఫ్రెండ్'తో సంగీత దర్శకురాలిగా మారారు భవతారణి. సల్మాన్ ఖాన్, అభిషేక్ బచ్చన్, శిల్పాశెట్టి ముఖ్య తారలుగా వచ్చిన హిందీ చిత్రం 'ఫిర్ మిలేంగే' (2004) సినిమాకు ఓ సంగీత దర్శకురాలిగా చేశారు. హిందీలో ఆమెకు ఇది తొలి చిత్రం. తెలుగులో 'అవునా'(2003), కన్నడలో 'గీయా గీయా' (2005) సినిమాలకు సంగీతం అందించారు భవతారణి. దాదాపు పది చిత్రాలకు సంగీత దర్శకురాలిగా చేశారు. అడ్వర్టైజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆర్. శబరిరాజ్‌తో భవతారణి వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు.

భవతారిణి మృతి పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మాటలు హత్తుకునేలా ఉన్నాయి - 'దిల్' రాజు


● మోక్ష, 'దిల్' రాజు, కృష్ణవంశీ

''అలనాటి రామచంద్రుడు' చిత్ర దర్శకుడు, నిర్మాత.. ఇలా అందరూ కొత్తవారే. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని థియేటర్లోకి తీసుకెళ్లడం గొప్ప విషయం. ఇకపై ఈ యూనిట్ అంతా చాలా కష్టపడాలి.. సినిమాని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కృష్ణవంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని 'దిల్' రాజు విడుదల చేసి, మాట్లాడుతూ-''అలనాటి రామచంద్రుడు' టైటిల్ బాగుంది. మాటలు మనసుని హత్తుకునేలా ఉన్నాయి. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''సరికొత్త ప్రేమకథా చిత్రమిది. చక్కని వినోదం ఉంటుంది'' అన్నారు చిలుకూరి ఆకాష్ రెడ్డి. ''మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా సినిమా ప్రేక్షకులని అలరిస్తుంది'' అన్నారు శ్రీరామ్ జడపోలు. ''అలనాటి రామచంద్రుడు' వంటి మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు కృతజ్ఞతలు అన్నారు కృష్ణవంశీ, మోక్ష.

సినిమానే మాట్లాడుతుంది


● రవి కస్తూరి

గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం రవి కస్తూరి విలేకరులతో మాట్లాడుతూ- ''ఆస్ట్రేలియాలో నాకు వ్యాపారాలున్నాయి. నిర్మాతగా నాకు ఇది తొలి చిత్రం. గీతానంద్ హీరోగా, నేను నిర్మాతగా సినిమాలు చేయాలనుకున్నాం. కథ సెట్ కావడంతో 'గేమ్ ఆన్' స్టార్ట్ చేశాం. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగమించాడు? అనేది గేమ్ ఆన్‌లో చూపించాం. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా కూడా. ఓ సినిమాకు మనం ఎంత పబ్లిసిటీ చేసినా మార్నింగ్ షోకు ఆడియన్స్ వెళ్లేంతవరకే. ఆ తర్వాత సినిమానే మాట్లాడుతుంది'' అని చెప్పుకొచ్చారు.

రత్నం రెడీ


● విశాల్

వేసవిలో థియేటర్స్‌కు వస్తున్నాడు 'రత్నం'. విశాల్ హీరోగా నటించిన తాజా యాక్షన్ ఫిల్మ్ 'రత్నం'. ఈ చిత్రంలో ప్రియాభవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. హరి దర్శకత్వంలో కార్తికేయన్ సంతానం ఈ సినిమాను నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమాను వేసవిలో ఏప్రిల్ 26న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'తుప్పరివాలన్' (తెలుగులో 'డిటెక్టివ్')కి సీక్వెల్‌గా 'తుప్పరివాలన్ 2' చేస్తున్నారు విశాల్. ఈ మూవీలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహించనున్నారట విశాల్. ఈ ఏడాదే చిత్రీకరణ ప్రారంభించాలనుకుంటున్నారని సమాచారం.